దీవించమ్మా.. ధనలక్ష్మి


పొదలకూరు : అమ్మవారికి అభిషేకం

• వివిధ రూపాల్లో అమ్మవార్ల కటాక్షం

పొదలకూరు : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగ రంగ వైభవంగా జరుగుతున్నాయి. పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను కటాక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో బుధవారం అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లలిత సహస్రనామార్చన, త్రిశతి, సాయంత్రం ఖడ్గమాల పూజలు నిర్వహించారు.

శివాలయంలో..

పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రులు పూర్తయ్యేంత ప్రతిరోజు తెల్లవారుజామున 5.30 గంటలకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహిస్తున్నారు.

• పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి బుధవారం ఉదయం అభిషేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పసుపు చామంతి పూలతో అలంకరణ చేశారు.

మంగళగౌరి అలంకారంలో..

వెంకటాచలం : మండలంలోని కాకుటూరులో ఉన్న శ్రీరాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు భవాని (మంగళగౌరి) అలంకారంలో కొలువుదీరారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం సామూహిక కుంకుమ పూజ, పల్లకిసేవ జరిగింది. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా కుంకాల బ్రదర్స్ వ్యవహరించారు.

ధనలక్ష్మి, గౌరీదేవిగా అమ్మవారు

మనుబోలు : శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మనుబోలు కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయం, దశరా చావిడిలో అమ్మవారు బుధవారం ధనలక్ష్మి, గౌరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పోలేరమ్మ ఆలయం వద్ద అర్చకుడు శ్రీనివాసులు అమ్మవారికి ధనలక్ష్మి అలంకారం చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అలాగే దశరా చావిడి వద్ద అర్చకులు సాయి శర్మ, హరికృష్ణ కలశ ప్రతిష్ట చేసి అమ్మవారిని గౌరీదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా విజ్జపురి వెంకటరావు–పుష్ప, వేముల శ్రీనివాసులు–సంధ్య దంపతులు వ్యవహరించారు.

ధనలక్ష్మీదేవిగా అమ్మవారు

ఇందుకూరుపేట : శరన్నవరాత్రులను పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి అమ్మవారు బుధవారం ధనలక్ష్మీదేవిగా భక్తులను కటాక్షించారు. తొలుత అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి అభిషేకాలు, పూజలు జరిపారు. ఆలయ అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణ స్వామి, కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు స్థానికులు కర్పూరం హైమావతమ్మ, కుమారుడు శివకుమార్‌రెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

పల్లిపాడులో..

మండలంలోని పల్లిపాడులో కొలువైన మీనాక్షి సమేత రామేశ్వర వేణుగోపాలస్వామి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా గురజాల చెంచయ్య, అన్నపూర్ణ దంపతులు వ్యవహరించారు.

మైపాడులో..

తీరప్రాంతమైన మైపాడు గ్రామంలో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన, పల్లకి సేవ శాస్త్రోక్తంగా జరిగింది. నరసాపురానికి చెందిన సంగం మహేశ్వరరావు జ్ఞాపకార్థం కుమారుడు రవికుమార్ ఉభయదాతగా వ్యవహరించారు.

ఇందుకూరుపేటలో..

మండల కేంద్రమైన ఇందుకూరుపేటలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అమ్మవారికి పల్లకి సేవ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన వేడుకకు ఉభయకర్తగా పి.శ్రీనివాసులు వ్యవహరించారు. ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మధుకైటభ వధ అలంకారంలో...

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నవరాత్రుల సందర్భంగా జొన్నవాడలోని కామాక్షితాయి దేవస్థానంలో అమ్మవారు బుధవారం మధుకై టభవధ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీసూక్త పారాయణం, దేవీసప్తశతి, దేవీ భాగవత పారాయణం, పుణ్య హవచనం, కలశపూజ, మహా నవావరణ పూజలు జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సామూహిక కుంకుమార్చన కార్యక్రమం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పి.లక్ష్మీసుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ. గిరికష్ణ పాల్గొన్నారు.


బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మధుకైటభవధ అలంకారంలో కామాక్షితాయి


ఇందుకూరుపేట : ధనలక్ష్మిగా చాముండేశ్వరీదేవి


వెంకటాచలం : మంగళగౌరి అలంకారంలో..


మనుబోలు : గౌరీదేవిగా అమ్మవారు


మనుబోలు : ధనలక్ష్మి అలంకారం


పొదలకూరు : ధనలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి

క్లుప్తంగా

నేడు మండలాల్లో మంత్రి కాకాణి పర్యటన

పొదలకూరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 'నా భూమి–నా దేశం' కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం ఉదయం 10 గంటలకు పాల్గొంటారని ఎంపీడీఓ నగేష్‌కుమారి బుధవారం తెలిపారు. తర్వాత మండలంలోని మొగళ్లూరు సిమెంటురోడ్డును ప్రారంభిస్తారన్నారు. వావింటపర్తి సచివాలయ భవనాన్ని ప్రారంభించి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొంటారని వెల్లడించారు.

ముత్తుకూరుకు..

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం సాయంత్రం ముత్తుకూరుకు వస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధనరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగే నాయకులు, కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొంటారన్నారు.

వవ్వేరులో మెప్మా సమావేశం


సర్వసభ్య సమావేశంలో పొదుపు మహిళలు


బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరు గ్రామంలో మెప్మా పొదుపు సంఘాల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఇందులో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్‌పర్సన్ లలితారెడ్డి హాజరై, మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆమె సూచించారు. మహిళల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న జగనన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం లలిత, మెప్మా ఆర్పీలు, పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న తూమును మార్చండి




మనుబోలు : వీధి మధ్యలో దెబ్బతిన్న తూమును మార్చి కొత్తగా ఏర్పాటు చేయాలని మనుబోలు సీఎంనగర్ వాసులు కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం దెబ్బతిన్న తూము వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మురుగు నీరు వెళ్లేందుకు వీధికి అడ్డంగా వేసిన సిమెంట్ తూము ఏడాది క్రితం దెబ్బతిందన్నారు. అయితే కొత్తగా సీసీ రోడ్డు వేసే సమయంలో ఈ విషయాన్ని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. ఇకనైనా దెబ్బతిన్న తూమును మార్చి కొత్తది వేయాలని కోరారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కార్తీక్‌రెడ్డి స్పందిస్తూ రెండు రోజుల్లో కొత్త తూము ఏర్పాటు చేసి స్థానికుల ఇబ్బందిని తొలగిస్తామన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుతో ఓబీసీలకు అన్యాయం


మాట్లాడుతున్న శంకర్‌రావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మహిళా రిజర్వేషన్ బిల్లుతో ఓబీసీ మహిళలకు అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌రావు ఆరోపించారు. నగరంలోని ఓ హోటల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాగమల్లేశ్వరరావు, క్రాంతికుమార్, విజయమ్మ, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

సింహగర్జన జయప్రదానికి పిలుపు



మాట్లాడుతున్న సుభాన్

నెల్లూరు(మినీబైపాస్): గుంటూరులో ఈ నెల 29న నిర్వహించనున్న నూర్‌బాషా, దూదేకుల ముస్లిం సింహగర్జనను జయప్రదం చేయాలని సంఘ జిల్లా అధ్యక్షుడు సుభాన్ బాషా పిలుపునిచ్చారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అల్తాఫ్, సాయిబాబు, షరీఫ్, హజ్రత్ అలీ, జహీర్‌బాషా, నిర్మల్, నవాజ్, అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

కసుమూరు దర్గా అభివృద్ధికి కృషి

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


కసుమూరులో అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి

వెంకటాచలం : దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన కసుమూరు దర్గా అభివృద్ధికి అన్నివిధాలా కృషి చేస్తున్నామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులను కల్పిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కసుమూరులో రూ.1.62 కోట్లతో నిర్మించిన సీసీరోడ్లు, సైడు కాలువలు, భక్తుల వసతి సముదాయాన్ని మంత్రి కాకాణి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన కార్యక్రమాలు ఆర్భాటంగా చేసి పనులు చేయలేని, అందుకు భిన్నంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయల నిధులను అభివృద్ధి పనులకు కేటాయించారని తెలియజేశారు. అందులో భాగంగానే పనులకు సంబంధించి శంకుస్థాపనలు చేయడమే కాకుండా, పనులను పూర్తి చేయించడంతో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కసుమూరు గ్రామంలోనే రూ.8.80 కోట్ల మేర అభివృద్ధి పనులు చేశామని వివరించారు. గతంలో ఇలాంటి అభివృద్ధి పనులు ఏ ప్రభుత్వంలోనైనా జరిగాయా.. అనేది ప్రజలు ఒకసారి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రసిద్ధ మస్తాన్‌వలి దర్గా ఉన్న కసుమూరును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, భక్తులకు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇందుకోసం వక్ఫ్‌బోర్డు ద్వారా రూ.కోటి నిధులను మంజూరు చేయించామన్నారు. మస్తాన్‌వలి పవిత్ర పాదాలు కలిగిన కొండ ప్రాంతానికి వచ్చే భక్తుల విశ్రాంతి కోసం రూ.30 లక్షలు వెచ్చించి 8 గదులు, 20 స్నానపు గదులు నిర్మించామని తెలియజేశారు. పార్టీల ప్రమేయం లేకుండా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మస్తాన్‌వలి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమేష్, ఎంపీపీ మందా కవిత, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకటశేషయ్య, సర్పంచ్ కడివేటి శివ, వైఎస్సార్‌సీపీ నేతలు చీకుర్తి నరసయ్య, హుస్సేన్, గుర్రం పుట్టయ్య, బాబర్, దస్తగిరి, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫుట్‌బాల్ టోర్నీ ఫైనల్స్


ఫుట్‌బాల్ టోర్నీలో తలపడుతున్న క్రీడాకారులు

ముత్తుకూరు : ముత్తుకూరుకు సమీపంలోని గోపాలపురం అదానీ వరల్డ్ స్కూల్‌లో ఈనెల 16వ తేదీన మొదలైన 2023–24 సీబీఎస్‌ఈ క్లస్టర్–7 అండర్–19 జోనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు సంబంధించి గురువారం ఫైనల్స్ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి 61 పాఠశాలల నుంచి 1,000 మందికిపైగా విద్యార్థులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నారని వెల్లడించారు. ఇందులో 44 పాఠశాలల విద్యార్థులు పరాజయం పాలవగా, మిగిలిన పాఠశాలల విద్యార్థుల మధ్య గురువారం పోటీలు జరుగుతాయని, విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందని చెప్పారు. కాగా బుధవారం కూడా పోటీలు హోరాహోరీగా జరిగాయి.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : విద్యార్థుల్లో పుస్తక పఠనం పెంపొందించడానికి దసరా సెలవుల్లో 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని బుచ్చిరెడ్డిపాళెం గ్రంథాలయాధికారి కె.మంజుల అన్నారు. స్థానిక గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. దీని ద్వారా విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సుధీర్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు


స్థలాన్ని చదును చేస్తున్న జేసీబీ

పొదలకూరు : పట్టణంలోని సత్యనారాయణ లేఅవుట్లో ఉన్న పంచాయతీ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే చర్యలు తీసుకుంటామని పొదలకూరు పంచాయతీ ఇన్‌చార్జి సెక్రటరీ బాలకృష్ణయ్య హెచ్చరించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లేఅవుట్లో పంచాయతీ ఆధీనంలో ఉన్న స్థలాన్ని స్థానికులు ఆక్రమించేందుకు జేసీబీతో చదును చేస్తుండగా తనకు సమాచారం అందడంతో హుటాహుటిన వెళ్లానని, పట్టణానికి చెందిన కొందరు స్థలం తమదని తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. అయితే అందుకు సంబంధించిన డాక్యుమెంట్లను చూపించాల్సిందిగా కోరినట్లు తెలిపారు. ఈ స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు లేదా న్యాయపరమైన ఉత్తర్వులు ఉంటే పరిశీలించి మీడియా దృష్టికి తీసుకొస్తామన్నారు. ప్రస్తుతం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు.

వాహనాలకు వేలంపాట

పొదలకూరు : స్థానిక పోలీస్‌స్టేషన్లో ఎస్‌ఈబీ అధికారులు రెండు వాహనాలకు బుధవారం వేలం వేశారు. ఈ సందర్భంగా సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ మాట్లాడుతూ మద్యం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలంపాట నిర్వహించినట్లు తెలిపారు. ఒక ఆటోతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని వేలం వేసినట్లు చెప్పారు. రెండు వాహనాలకు కలిపి ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.72,500 కాగా వేలంలో రూ.1,22,800 వచ్చినట్లు వెల్లడించారు. ఈ వేలంపాటలో పొదలకూరు సీఐ జి.సంగమేశ్వరరావు పాల్గొన్నారు.

పోలంరెడ్డి డ్రైవర్ అసభ్య ప్రవర్తన

• పోలీసులకు ఫిర్యాదు చేసిన వివాహిత


హరీష్ (ఫైల్)

కోవూరు : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న రేబాల గ్రామానికి చెందిన హరీష్ అసభ్యకర ప్రవర్తనపై అదే ప్రాంతానికి చెందిన వివాహిత నెల్లూరు శ్రావణకుమారి బుధవారం బుచ్చిరెడ్డిపాళెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం మేరకు.. దామరమడుగు గ్రామంలోని ఆర్‌ఆర్‌నగర్ కాలనీలో నివాసముంటున్న శ్రావణకుమారి తన భర్తతో కలిసి నివాసముంటోంది. ఈనెల 16న రాత్రి తన భర్తతో ఏకాంతంగా ఉన్న సమయంలో దినేష్‌రెడ్డి డ్రైవర్ హరీష్ బెడ్‌రూమ్ పైభాగంలో ఉన్న కిటికీ నుంచి సెల్‌ఫోన్‌లో వీడియోను తీశాడు. వెంటనే ఆమె భర్త గమనించి హరీష్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించగా అతను పరారయ్యాడు. ఈ విషయాన్ని గ్రామపెద్ద అయిన మన్నెం నాగేంద్రకు చెప్పగా, దానిని మనసులో పెట్టుకొని హరీష్ మామ చిన పెంచలయ్య నాగేంద్ర ఇంటికి వెళ్లి అసభ్య పదజాలంతో దూషించాడు. అంతే కాకుండా నాగేంద్రపై దాడి చేశాడు. హరీష్ ఆగడాలు పెరిగిపోతున్నాయని, అతనిపై చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష


రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్


వృద్ధురాలికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పొదలకూరు : మండలంలోని నావూరు హైస్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను బుధవారం నిర్వహించారు. మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు పర్యవేక్షణలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. హెల్ప్‌డెస్క్ ద్వారా క్యాంపునకు వచ్చిన రోగులను వలంటీర్లు, సిబ్బంది వైద్యనిపుణుల వద్దకు తీసుకెళ్లారు. చెన్నారెడ్డిపల్లి, నావూరు, నావూరుపల్లి గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రోగులు శిబిరానికి హాజరయ్యారు. ఇంటింటి సర్వేలో అందజేసిన టోకెన్ల ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ శిబిరంలో పొదలకూరు సీహెచ్‌సీ వైద్యనిపుణులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు మల్లూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

ముత్తుకూరు : మండలంలోని మల్లూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం జరుగుతుందని సర్పంచ్ దువ్వూరు విజయకుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు నిర్వహించే హెల్త్ క్యాంప్‌లో స్థానికులు వైద్య పరీక్షలు జరిపించుకుని, ఉచితంగా మందులు స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జాబ్‌కార్డుల అందజేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : తోటపల్లిగూడూరు మండలం నెలిమిట్టి కండ్రిగ ఎంపీపీ స్కూల్‌లో పీఎంయూ, ఐటీడీఏ నెల్లూరు వారి ఆధ్వర్యంలో యానాది కులానికి చెందిన మహిళలకు బుధవారం జాబ్‌కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ మందా రాణి మాట్లాడుతూ, మొబైల్ ఆధార్ క్యాంపు ద్వారా ఎంత మంది యానాదులకు లబ్ధి చేకూరిందో తెలుసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఆధార్ కలిగి ఉండడం వల్ల కొత్త రేషన్‌కార్డులు, ఫ్యామిలీ మెంబర్‌ను యాడ్ చేయడంతో పాటు, హౌస్ హోల్డ్ క్లస్టర్ మ్యాపింగ్ చేయటం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని, యానాదులు విద్యావంతులై అన్నిరంగాల్లో రాణించాలని కోరారు. కోడూరు సచివాలయం–2 పరిధిలోని గ్రామాల్లో 30 కుటుంబాలకు జాబ్‌కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ప్రేమ్‌తేజ, కిరణ్, జాన్, సుధాకర్, మస్తాన్, కోడూరు పంచాయతీ సెక్రటరీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.